క్లుప్తంగా

అమరావతి మ్యూజియం సందర్శన



అమరావతి: ప్రపంచ ప్రఖ్యాతి చెందిన అమరావతి మ్యూజియాన్ని పురావస్తుశాఖ సూపరింటెండెంట్ గోపీనాథ్ జీనా శనివారం సందర్శించారు. మ్యూజియంలోని మహాస్థూపం, కొత్త మ్యూజియంలోని శిల్పాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన వారసత్వ సంపదను కాపాడుకోవాలన్నారు. ధరణికోటలో పురావస్తు శాఖకు చెందిన శాతవాహనుల కోట దిబ్బలు ఆక్రమణలకు గురవుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే కోటదిబ్బల చుట్టూ ఫెన్సింగ్ వేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్శనలో ఆయన వెంట అమరావతి మ్యూజియం ఇన్‌చార్జి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



మాదల(ముప్పాళ్ళ): మాదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల పీఈటీ ఎస్.కె.ఎం.డి. రియాజ్ శనివారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గతనెల 27న చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన అండర్–14 బాలురు, బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో మాదల జెడ్పీ పాఠశాలకు చెందిన ఎస్.శ్రావ్య, కె.నవీన్ ఆడారు. మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరినీ ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీ



పెదకూరపాడు: ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీకి గురైన ఘటన మండలంలోని గారపాడులో శుక్రవారం రాత్రి జరిగింది. పెదకూరపాడు–గుంటూరు మధ్య నడిచే ఆర్టీసీ బస్సుకు శుక్రవారం రాత్రి గారపాడు గ్రామంలో నైట్ హాల్ట్ ఇచ్చారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు 172 లీటర్ల డీజిల్‌ను దొంగిలించినట్లు కండక్టర్, డ్రైవర్ పెదకూరపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలో జలాలపురం, కంభంపాడు గ్రామాల్లోనూ ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీకి గురైంది. ఈక్రమంలో ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు ఎస్సై కృష్ణారావు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

దాచేపల్లి: హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ బిలాలుద్దీన్ శనివారం తెలిపారు. దాచేపల్లి నగర పంచాయతీలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న గరికపాటి కోటేశ్వరరావు గత నెల 24న హత్యకు గురైన విషయం తెలిసిందే. హతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈకేసులో నిందితులుగా ఉన్న బంబోతుల సైదయ్య, అతని భార్య కోటమ్మ, కుమారుడు నాగరాజు, హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. దాచేపల్లిలోని అచ్చాలగడ్డలో సంచరిస్తున్న వీరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ బిలాలుద్దీన్ తెలిపారు. హత్యకు ఉపయోగించిన కర్ర, ద్విచక్రవాహనం, గొడ్డలి తదితర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయ సంఘ నాయకుడు మృతి

మాచర్ల: పట్టణంలో నివాసం ఉండే ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ సంఘ నాయకుడు శర్వన్ నాయక్ (45) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని ఆర్‌కేసీ కాలనీ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న శర్వన్ నాయక్ విధులలో ఉండగానే మరణించారు. ఎస్టీయూ నాయకునిగా, ఎమ్మార్పీగా ఆయన పనిచేశారు. శర్వన్ నాయక్ మృతి పట్ల ఎంఈఓ వేముల నాగయ్య, ఎస్టీయూ సంఘం జిల్లా నాయకులు గంగాధర్, శిలార్, రాజశేఖర్, భాస్కర్, రెవెన్యూ 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సోమ్లానాయక్, రిటైర్డ్ తహసీల్దార్ నందా నర్సింహయ్య, పలువురు యూనియన్ నాయకులు సంతాపం తెలిపారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

రెంటచింతల: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం ద్వారా 2021–22 సంవత్సరంలో మండలానికి 401 ఇళ్లు మంజూరైనట్లు గృహనిర్మాణ శాఖ ఏఈ శ్రీనివాసరావు చెప్పారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు.

క్లాప్ మిత్రలను ఆదుకుంటాం



త్రిపురాపురంలో క్లాప్‌మిత్రలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి

నకరికల్లు/ముప్పాళ్ల: గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని పరిరక్షిస్తున్న క్లాప్‌మిత్రల కోసం ప్రభుత్వం వసతులు కల్పిస్తోందని, వారిని అన్ని విధాలా ఆదుకుంటామని డీఆర్‌డీఏ పీడీ బి.బాలూనాయక్ చెప్పారు. మండలంలోని నకరికల్లు, త్రిపురాపురం గ్రామాల్లో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాన్ని ఆయన శనివారం నిర్వహించారు. క్లాప్ మిత్రలతో కలిసి టీ సేవించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీధుల్లో పర్యటించారు. చెత్త సేకరణపై ఆరా తీశారు. క్లాప్ మిత్రల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. అవసరమైన పరికరాలు అందజేస్తోందన్నారు. అర్హులందరికీ పింఛన్, నివేశనాస్థలాలు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శులు అరుణప్రియ, జోత్స్న, మద్దం సురేష్ , ఈఓపీఆర్డీ గిరిధర్, పలుశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

ముప్పాళ్ళలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం శనివారం జరిగింది. మండల ప్రత్యేకాధికారి, నరసరావుపేట పశుసంవర్ధకశాఖ ఏడీఏ కె.కాంతారావు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. క్లాప్‌మిత్రలతో సమావేశమయ్యారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చెత్త సేకరణ తీరు గురించి ఆరా తీశారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఆయనతో పాటుగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ఆర్.నాగేశ్వరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు వరం గురుకులాలు

సత్తెనపల్లి పట్టణ సీఐ శోభన్‌బాబు



గురుకుల ప్రవేశ నమూనా ప్రశ్న పత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐ శోభన్‌బాబు

సత్తెనపల్లి : చదువు'కొన'లేని స్థితిలో ఉన్న పేద విద్యార్థులకు సాంఘిక సంక్షేమ గురుకుల, ఆశ్రమ పాఠశాలలు వరమని, ప్రభుత్వం అందిస్తున్న వసతులను, వనరులను, అవకాశాలను అందిపుచ్చుకొని ఎదగాలని పట్టణ సీఐ యు.శోభన్ బాబు అన్నారు. కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ముద్రించిన గురుకుల ప్రవేశ నమూనా ప్రశ్న పత్రాలను శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సేవలతోపాటు, స్వచ్ఛంద సంస్థలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్డ్స్ బాలబాట కేంద్రాలు చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో కార్డ్స్ డెప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్నాథ్, స్థానిక నాయకులు జొన్నలగడ్డ ఆనంద్, గుజ్జర్లపూడి సతీష్, చిలక రమణయ్య, జాన్సన్, విజయ్ చంద్ర, పచ్చల నాగేశ్వరరావు, గన్నవరం ఏలియ పాల్గొన్నారు.

మహిళా హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి శారదాదేవి, చిత్రంలో జడ్జి మధుబాబు తదితరులు

మాచర్ల : మహిళా హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సి.మధుబాబు, అదనపు జడ్జి శారదా దేవి చెప్పారు. శనివారం కోర్టు ప్రాంగణంలో జాతీయ మహిళా కమిషన్ సౌజన్యంతో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మధుబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ మహిళల హక్కులు, చట్టాల గురించి వివరించారు. అనంతరం జడ్జిలను మెప్మా ప్రాజెక్టు సీఈఓ రాజశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాస్, లోక్ అదాలత్ మెంబర్లు గౌస్‌పాషా, గట్ల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు ఆర్‌పీలు, కోర్టు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహా.. నమో..



లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్ల విగ్రహాలు



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న యెనుముల, పోలు

గురజాల : శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కటాక్షం అందరిపై ఉండాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి ఆకాంక్షించారు. నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో కొత్తగా నిర్మితమైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ విగ్రహాలు, ధ్వజస్తంభం ఊరేగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం జరిగింది. తొలుత విగ్రహాలకు, ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, శౌరెడ్డి, వీరంరెడ్డి అమరారెడ్డి, బాసిరెడ్డి ఇష్టకామిరెడ్డి, గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటప్పయ్య అధికారులు, ప్రజాప్రతినిధులు

పిడుగురాళ్ల: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ కల్పిస్తోందని డీఈఓ ఎం.వెంకటప్పయ్య చెప్పారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. డీఈఓ ఎం.వెంకటప్పయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఉచిత వైద్య శిబిరాల నిర్వహణకు మండలానికి రూ.పదివేల చొప్పున కేటాయించిందని వివరించారు. జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి ప్రసంగించారు. అనంతరం వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. డెప్యూటీ డీఈవో వై.వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.కాశయ్య, ఎంఈవో ఒ.రాజు, వైద్యులు చక్రవర్తి, భువనేశ్వరి, సతీష్, రాంబాబు, శ్రీనివాసరావు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించిన డీఎంఓ



సంజీవరెడ్డి నగర్ ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

పిడుగురాళ్ల: స్థానిక సంజీవరెడ్డి నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైద్యులు బి.మణికంఠ, ఎంపీహెచ్ఈవో ఎస్.కాశీ విశ్వనాథం, సూపర్‌వైజర్లు వి.రామ గురవమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎస్‌కే రహీం, ఏఎన్‌ఎంలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ తప్పనిసరి

మాచవరం: ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి చిన్నారులను, గర్భిణులను రక్షించుకునేందుకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ చెప్పారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోర్జంపాడు, మాచవరం, పిన్నెల్లి, కొత్తపాలెం, పిల్లుట్ల, మల్లవోలు గ్రామాలను సందర్శించి, టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు చక్రవర్తి, ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సత్రశాలలో 16 రోజుల పండగ

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో బుధవారం 16 రోజుల పండగ నిర్వహించనున్నట్లు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఈఓ గాదె రామిరెడ్డి శనివారం తెలిపారు. మహా శివరాత్రి వెళ్లిన 16 రోజుల తరువాత ఈ పండగను దేవస్థానంలో వసంతోత్సవంగా జరపడం ఆనవాయితీ.

నేటి నుంచి సామాజిక తనిఖీ గ్రామ సభలు

ముప్పాళ్ళ: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు ఈనెల 5 ఆదివారం నుంచి జరుగుతాయని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు శనివారం తెలిపారు. 5న లంకెలకూరపాడు, మాదల, 6న ఇరుకుపాలెం, 8న బొల్లవరం, కుందురువారిపాలెం, 9న ముప్పాళ్ళ, 10న తొండపి, 11న గోళ్ళపాడు, దమ్మాలపాడు, 12న చాగంటివారిపాలెం, నార్నెపాడు, పలుదేవర్లపాడు, తురకపాలెం గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు జరుగుతాయన్నారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పట్టణంలోని పురపాలక సంఘ హెడ్ వాటర్ వర్క్స్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 6, 7 తేదీల్లో రెండు రోజులపాటు పట్టణంలోని 11 నుంచి 24 వార్డులు అనగా వెంగళరెడ్డి నగర్, పార్క్ ఏరియా, రఘురాం నగర్, రాజుల కాలనీ, బోయ కాలనీ, వడ్డవల్లి, శాస్త్రి నగర్, మున్సిపల్ ఏరియా, కొత్తపేట, సాలిపేట, యానాది కాలనీ, నాగన్నకుంట ప్రాంతాలతోపాటు 5, 6, 7 వార్డులు, 8వ వార్డులోని ఓల్డ్ లైనులో మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శనివారం తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఇరుకుపాలెం గ్రామ సమీపంలోని మదర్సా వద్ద శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నరసరావుపేటకు చెందిన జొరిగె పవన్‌కుమార్(25) ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి సమీపంలోని లయోలా ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఇరుకుపాలెం సమీపంలోని మదర్సా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఇంజినీరింగ్ ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకునేందుకు పవన్‌కుమార్ కళాశాలకు వెళ్లినట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తెలిపారు.

గ్యాస్ ధరలను తగ్గించాలని నిరసన

సత్తెనపల్లి: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లోని శ్రీరామనగర్‌లో శనివారం మహిళలు గ్యాస్ సిలిండర్‌ను బయటపెట్టి నిరసన తెలిపారు. రజిని మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటికే పదిసార్లు గ్యాస్ ధరను పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా పట్టణ కార్యదర్శి గద్దె ఉమశ్రీ మాట్లాడుతూ వాణిజ్య సిలిండర్‌కి ఏకంగా రూ.350 పెంచడం వల్ల చిన్న వ్యాపారులు దుకాణాలు మూసేసుకు పోవాల్సిన దుస్థితి తలెత్తుతోందని వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గింజుపల్లి మాధవి, నాగలక్ష్మి, తుమ్మల లక్ష్మి పాల్గొన్నారు.

మహిళపై దాడి

నాదెండ్ల: పాతకక్షల నేపథ్యంలో అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు దాడి చేసినట్లు పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. మండలంలోని గొరిజవోలు గ్రామం ఎస్సీకాలనీకి చెందిన పసల స్వప్న అదే గ్రామానికి చెందిన అల్లడి అంకమ్మరావు, జూపల్లి మరియదాసు, గారపాటి ప్రభుదాసుతో పాటు మరో ఏడుగురు ఈనెల రెండోతేదీన తన ఇంటపైకి వచ్చి దాడి చేశారంటూ ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి

దాచేపల్లి : వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అభివృద్ధి అధికారి వై.మహాలక్ష్మి చెప్పారు. మాదినపాడు గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. తొలుత గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. నవరత్న పథకాల అమలుపై చర్చించారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలను సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. రానున్న వేసవిలో ఎండతీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని, ప్రధానంగా నీటి సమస్యలు రాకుండా చూడాలని మహాలక్ష్మి చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు సమర్థంగా అమలు చేయాలని, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా పనిచేయాలన్నారు. ఎస్‌డీజీ, ఆయుష్మాన్ భారత్ సర్వే పూర్తి చేయాలని, విద్యార్థుల కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. డీడీఓ వెంట ఈఓపీఆర్డీ మాధవీలత, సర్పంచ్ అనుముల అంజిరెడ్డి, తాటిపర్తి నర్సిరెడ్డి, ఎంపీటీసీ నంద్యాల వీరారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సకల వసతులు కల్పించాలి

- సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి
- ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహం ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగవెంకటలక్ష్మి

సత్తెనపల్లి: విద్యార్థినులకు అసౌకర్యం కలగకుండా అన్ని వసతులూ కల్పించాలని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికారి కమిటీ చైర్మన్ డి.నాగ వెంకట లక్ష్మి చెప్పారు. పట్టణంలోని వెంకటపతి కాలనీలో గల ఎస్సీ బాలికల సంక్షేమ వసతి గృహాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాత్రూంలకు తలుపులు సరిగ్గా లేవని, కిటికీలకు గ్లాసులు లేవని, బాత్రూంలో దుర్వాసన వస్తోందని వెంటనే మర్మతులు చేయించాలని వార్డెన్‌ను ఆదేశించారు. గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాలను, వంటశాలను స్వయంగా పరిశీలించారు. రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆహారం ఎలా ఉంటుందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని తదితరులు ఉన్నారు.

బీజేపీది రాజ్యాంగ వ్యతిరేక పాలన



సమావేశం అనంతరం వివరాలు వెల్లడిస్తున్న శ్రీనివాసబాబు, చిత్రంలో నాయకులు

సత్తెనపల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిది రాజ్యాంగ వ్యతిరేక పాలన అని సీనియర్ న్యాయవాది బత్తిన శ్రీనివాసబాబు విమర్శించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నేటి రాజకీయ పరిస్థితులపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య మాట్లాడుతూ ప్రశ్నించే వ్యక్తులను, శక్తులను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జైభీమ్ భారత్ పార్టీ నాయకులు విజయకుమార్, బహుజన పార్టీ నాయకులు బి.సంగీత రావు, జన విజ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడు ఎం.ఏడుకొండలు, సీపీఐ నియోజకవర్గ నాయకులు యిర్మియా, ఎస్.వేణు, సీఐటీయూ నాయకులు పురుషోత్తం, దళిత మహాసభ నాయకులు ఆంథోనీ, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పాల్ రాజ్, విశ్రాంత ఉద్యోగులు హనుమంతరావు, సీనియర్ న్యాయ వాది బత్తుల ఆదినారాయణ, జి.రాజు పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్ దాసుకు సత్కారం



ఏఎంసీ వైస్‌చైర్మన్‌ను సత్కరిస్తున్న చర్మకారుల సంఘం ప్రతినిధులు

క్రోసూరు: క్రోసూరు ఏఎంసీ వైస్‌చైర్మన్‌గా ఎంపికైన గార్లపాటిదాసును ఏపీ చర్మకారుల సంఘం ప్రతినిధులు శనివారం సత్కరించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రాం విగ్రహాల సెంటర్ వద్ద సత్కార కార్యక్రమం జరిగింది. ఏపీ చర్మకారుల సంఘం నియోజకవర్గ కన్వీనర్ చిల్కా భాస్కర్, జిల్లా సెక్రటరీ దుగ్గిప్రభుదాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాసు మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో తనకు పదవి లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. చర్మకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చిల్కాప్రసన్న, రవికుమార్, కంచర్ల అచ్యుతరావు, మందడపు నాగయ్య, బీఎస్పీ నాయకులు గనుపల్లి రాజశేఖరబాబు, చావల శ్రీనివాసరావు, కిన్నెర వెంకటేశ్వర్లు, మేదర రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీవైఈఓ వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రమణ మేడం స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ఏడు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రమణ మేడం శిష్యులు పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. వ్యాసరచన పోటీల్లో పెదగార్లపాడుకు చెందిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని జి.పూజిత, మాచర్లకు చెందిన శ్రీలక్ష్మీ, తేలుకుట్ల గ్రామానికి చెందిన డి.లక్ష్మీ ప్రణతి బహుమతులు గెలుచుకున్నారు. వక్తృత్వం పోటీల్లో గంగవరం గ్రామానికి చెందిన ఎంపీపీయూపీఎస్ విద్యార్థిని మానసప్రియ, షేక్ సాహిన, గామాలపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పి.శరణ్య బహుమతులు పొందారు. క్విజ్ పోటీలలో గురజాలకు చెందిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం, మాచర్ల జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ విద్యార్థులు ద్వితీయ స్థానం, మాచవరం జెడ్పీహెచ్ స్కూల్ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో ఎంఈవో ఒ.రాజు, ప్రధానోపాధ్యాయులు లింగాల ధనలక్ష్మి, కన్వీనర్ భైరెడ్డి, కార్యదర్శి వై.చందు, ఉపాధ్యాయులు రమణ, ఏడు మండలాల కో–ఆర్డినేటర్లు మురళి, అయేషా సుల్తానా, ఓర్సు సాగర్, అప్పారావు, రామలింగయ్య, సిహెచ్ గంగధర్ రావు, నరమాల హనుమంతరావు, వెంకటరెడ్డి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పాఠశాలలో ఇంటర్ విద్య అమలుకు కృషి



ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు



ఎత్తిపోతల ఆశ్రమ పాఠశాలలో జెడ్పీటీసీ మల్లుస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

విజయపురిసౌత్: ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్ విద్యను ప్రవేశపెట్టేలా కృషి చేస్తానని మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మల్లుస్వామి చెప్పారు. శుక్రవారం రాత్రి ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మల్లుస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ జి.దుర్గాభవాని ఆధ్వర్యంలో మల్లుస్వామిని సన్మానించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ పి.చంద్రరావు, తాళ్ళపల్లి సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య పాల్గొన్నారు.